

నేటి నుంచి ఇసుక ఉచిత సరఫరా

ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జిల్లాలో ఉచితంగా ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని అందుకు తగిన ఏర్పాట్లు చేశామని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు స్టాక్ పాయింట్ల ద్వారా వినియోగదారులకు ఇసుక సరఫరా చేసే ఏర్పాట్లు చేవట్టామన్నారు. ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటాగుళ్ళ, రామగిరి స్టాక్ యార్డుల నుంచి ఇసుక సరఫరా చేపట్టడం జరుగుతుందన్నారు. రోజుకు ఒక వ్యక్తికి 20 టన్నులకు మించకుండా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. టన్నుకు 277 రూపాయలు చొప్పున ఇసుక లోడింగ్ ఛార్జీలు వసూలు చేస్తామన్నారు. ఇసుక సరఫరాపై వినియోగదారుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామనిటోల్ ఫ్రీ నెంబర్ 18004256014 కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ కోరారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అలాగే డివిజన్, మండల, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కూడా అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

క్రాస్‌రోడ్‌లో సమన్వయకర్తలు



పాత స్థానాల్లో నిలబడేరా ?

ఎటూ తేల్చుకోలేని స్థితిలో నాయకులు

గందరగోళంలో వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమి తరువాత ఆపార్టీ సమన్వయకర్తలు ఎటువైపు ఉండనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలకు ముందు కొన్ని నియోజకవర్గాల్లో వైసిపి మార్పులు, చేర్పులు చేపట్టింది. ఈ మార్పులు జరిగిన చోట తోపాటు, పాతవారున్న చోట కూడా ఎన్నికల్లో ఘోర ఓటమినే వైసిపి చవిచూసింది. పాత స్థానాల్లో ఎటువంటి మార్పుల్లేకపోవడంతో అక్కడ సమన్వయకర్తలుగా వారే ఉంటున్నారు. కాని మార్పులు జరిగినచోట ఇప్పుడు విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కొత్తగా నియమించిన చోట ఉండాలా లేక పాత స్థానాల్లో వెళితే ఎలాగుంటుదన్న మీమాంసలో ఉన్నట్టు చర్చ నడుస్తోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో సుమారు ఏడు స్థానాల్లో మార్పులు చేపట్టింది. ఈ మార్పులు జరిగిన చోట కొత్తగా బాధ్యతలు తీసుకున్న వారు ముందుకు పోలేకపోతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి ప్రాతినిద్యం వహించిన ఉషచరణ్ శ్రీని పెనుకొండకు మార్చారు. ఆమె పెనుకొండలో పోటీ చేసి ఓటమి చెందారు. దీంతో ఆమె ఇక్కడ ఉంటుందా లేక పాత స్థానానికి పోతుందా అన్న చర్చ నడుస్తోంది. ఇక పెనుకొండలో అంతక మునుపు ప్రాతినిద్యం వహిస్తున్న శంకర నారాయణను ఎన్నికల సమయంలో అనంతపురం పార్లమెంటుకు మార్చారు. ఆయనకు పెనుకొండలో అనుయాయులు ఉన్నారు. దీంతో అక్కడకెళ్లేందుకు ఆయన ఆసక్తిగా ఉన్నారన్న చర్చ నడుస్తోంది. ఇక కదిరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. కదిరిలో అంతక మునుపు ఎమ్మెల్యేగా సిద్ధారెడ్డికి ఈసారి టిక్కెట్టు ఇవ్వలేదు. ఆయన స్థానంలో మక్బుల్ బాషాను తీసుకొచ్చారు. అప్పటి నుంచి సిద్ధారరెడ్డి మౌనంగా ఉంటూ వస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో సిద్ధారెడ్డి, మక్బుల్ వర్గీయులు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రెండు గ్రూపులకు చెందిన వారు ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో ఇప్పుడు ఎవరు ఇక్కడ కొనసాగుతారన్నది కూడా అయోమయంగానే ఉంది. శింగనమల నియోజకవర్గంలోనూ అదే రకమైన పరిస్థితి నెలకొంది. అంతక మునుపు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి కాదని వారు సూచించిన వీరాంజినేయులును సమన్వయకర్తగా నియమించారు. ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. అప్పటి నుంచి ఆయన ఎక్కడున్నాడో తెలియకుండా ఉంది. ముందు ఎమ్మెల్యేగా ఉన్న జొన్నలగడ్డ పద్మావతి కూడా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఇక్కడ వైసిపికి నడిపించే నాయకుడెవరన్నది తెలియని అయోమయం నెలకొంది. మడకశిరలోనూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి స్థానంలో వీరలక్కప్పను తీసుకొచ్చారు. ఇద్దరిలో ఎవరు పార్టీ బాధ్యతలను ఇకపై చేపడతారో తెలియదు. ఇలా మార్పులు చేపట్టిన స్థానాల్లో వైసిపిని నడిపించేది ఎవరన్న సందేహంగా మారింది. పాతవారేమో ముందు స్థానాలపైనే మనసు పెట్టుకుని ఉండగా, కొత్తవారు ఈ సమయంలో బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధపడటం అనుమానాస్పదంగా ఉంది. ఇలా కొత్త సమన్వయకర్తలున్న చోట నేతలు క్రాస్ రోడ్‌లో నిలబడినట్టయింది. ఎటు వెళ్లాలో తేల్చుకోలేకపోతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే వైసిపి సమన్వయకర్తల మార్పులు చేపట్టినట్టు ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ మార్పులు ఉంటాయా అన్నది చూడాల్సి ఉంది.

గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

పోటెత్తిన జనం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి తొలి దర్శనం లభించింది. స్వామివారి ప్రథమ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కుళ్లాయిస్వామిని చూడగానే భక్తులు పెద్దపెఎత్తున 'కుళ్లాయి స్వామి గోవిందా..గోవింద.. అంటూ స్మరించారు. ఇకపోతే ఆదివారం నుంచి 13రోజులపాటు గూగూడులో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన స్వామివారి చిన్న సరిగెత్తు 14న, పెద్ద సరిగెత్తు 16న, స్వామివారి అగ్నిగుండ ప్రవేశం 17వతేదీ తెల్లవారుజామున, అదేరోజు సాయంత్రం స్వామివారి జలధి కార్యక్రమం ఉంటుంది. 19న రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయి. స్వామి దర్శనానికి రాష్ట్రం నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు.



గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

ముస్కిన్ ఆశయాలను కొనసాగిస్తాం

సంతాప సభలో సిపిఎం నాయకులు



ముస్కిన్ సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముస్కిన్ ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల హఠాత్తుగా మృతి చెందిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముస్కిన్ సంతాప సభ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గుత్తి రోడ్డు లోని ఐదురెట్ల వద్ద సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభకు ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు శుభహాన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, వైసిపి నాయకులు కె.వి. రమణ, ఇన్సాఫ్, నాయకులు బంగారు భాష, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, రాజు కాలనీ ఉపసర్పంచి మసూద్, సిపిఎం నాయకులు తదితరులు హాజరయ్యారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుబహాన్ మాట్లాడుతూ ముస్కిన్ ఆవాజ్ కమిటీలో చురుకైన పాత్ర వహిస్తూ ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి ఎనలేని పోరాటాలు కొనసాగించారన్నారు. ఎన్ఆర్‌సి, సిఎఎ చట్టాల రద్దు కోసం నిర్వహించిన పోరాటంలో విశేష పోరాటం చేశారని, ముస్లిం మైనారిటీలను ఐక్యం చేసి పోరాటం మార్గంలో నడిపించడంలో తనదైన పాత్ర పోషించాడని గుర్తు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ మాట్లాడుతూ ముస్కిన్ మృతి సిపిఎంకి తీరని లోటు అన్నారు. పేదలు, కార్మికులు, కర్షకుల కోసం సిపిఎం నిర్వహించిన పోరాటంలో ముస్కిన్ చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పేదలకు ఇళ్లస్థలాల కోసం, కాలనీలో సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు కొనసాగించారని గుర్తు చేశారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడిని పార్టీ కోల్పోవడం బాధాకరం అన్నారు. పేదల పక్షాన నిలబడిన ముస్కిన్ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. సిపిఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి వి రామిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, నీరు, రోడ్ల సమస్యలపై ముస్కిన్ రాజీలేని పోరాటాలు కొనసాగించారని గుర్తు చేశారు. పార్టీకి ఎంతో అండగా ఉన్న ముస్కిన్ తనకు మిత్రుడుగా సోదరుడిగా మెలిగాడని క్రమశిక్షణ కలిగిన నాయకుడిని కోల్పోవడం ఎంతో బాధిస్తుందని అన్నారు. ఆయన ఆశయాల కొనసాగించడమే ముస్కిన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ముస్కిన్ కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, సిపిఎం నగర కమిటీ నాయకులు ప్రకాష్ రెడ్డి, మన్నెల రామాంజి, రాజు, వెంకటేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామంజినమ్మ, ఆవాజ్ నాయకులు నూరుల్లా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం కనుమరుగు



గ్రంథాలయ భవనానికి అడ్డుగా వెలసిన అంగళ్లు

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

'చిరిగిన చొక్కా అయిన తొడుక్కో..కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు కందుకూరి వీరేశలింగం. ఇటువంటి సూక్తులేన్నో పుస్తకాల ప్రాముఖ్యాన్ని, ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నాయి. తరతరాల విజ్ఞాన సంపదను అందించే విజ్ఞాన భాండాగారం గ్రంథాలయం. రాయలు ఏలిన పెనుకొండలో కొందరి స్వార్థపరులు గ్రంథాలయాన్ని కనుమరుగు చేసేందుకు కంకణం కట్టుకున్నారు.

పెనుకొండ పట్టణంలో ఉన్న గ్రంథాలయంలో 1700 మంది సభ్యులున్నారు. గ్రంథాలయంలో 19,481 వరకు వివిధ రకాలు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ వందమంది గ్రంథాలయానికి వచ్చి వివిధ రకాల పుస్తకాలు, దినపత్రికలు, నవలలు చదువుకుంటారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నిరుద్యోగులకు పోటీపరీక్షలకు అనసవరమైన పుస్తకాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు నవలలు అందుబాటులో ఉన్నాయి. వీటిని చదవడానికి ప్రతిరోజు పాఠకులు గ్రంథాలయానికి వస్తారు.

అడ్డుగా వెలసిన అంగళ్లు

గ్రంథాలయం సబ్‌రిజిస్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉంది. కొందరు స్వార్థపరులు గ్రంథాయం తలుపులు, కిటికీలకు అడ్డుగా రాత్రికి రాత్రి అంగళ్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రంథాలయం ముందు పట్టణ ప్రథమ పౌరుడుకు సంబంధించిన బంధువులకు చెందిన ఒకరు చిన్నపెట్టె పెట్టి అందులో జిరాక్స్‌లు, కంప్యూటర్ పని చేస్తున్నారు. మరో వైసిపి సోషల్‌మీడియాకు చెందిన ఒక వ్యక్తి సెల్‌ఫోను పరికరాల వ్యాపారం చేసుకుంటున్నారు. వీరిద్దరు ఒక్కొక్కరు ఒక్కొక్క కిటికీలకు అడ్డుగా పెట్టెలు వేసుకున్నారు. దీనికి తోడు తోపుడు బండ్ల వ్యాపారులు, చిరువ్యాపారులు గ్రంథాలయం ఎదురుగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో గ్రంథాలయం కనపడకుండా పోతోంది. పల్లెల నుంచి వచ్చే విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయం ఎక్కడ ఉందో వెతుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు, విద్యార్థులు

అంగళ్లను దాటుకుని గ్రంథాలయంలోకి వెళ్లితే అక్కడ మరో సమస్యను పాఠకులు, విద్యార్థులు ఎదుర్కొవాల్సి వస్తోంది. గ్రంథాలయం కిటికీలు, తలుపులకు అడ్డుగా అంగళ్ళు వేయడంతో గ్రంథాలయంలో చీకటి అలముకుంది. చీకట్లో పుస్తకాలు, దినపత్రికలు, నవలలు చదవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి, వెలుతురు లేక చదవుకోలేక పోతున్నారు. కరెంటు ఉంటే వెలుతురు, గాలి ఉంటుందని పాఠకులు అంటున్నారు.

అడ్డుగా వెలసిన అంగళ్లు
పట్టించుకోని అధికారులు
ఇబ్బందుల్లో పాఠకులు

మంత్రి సవిత స్పందించాలి

గ్రంథాలయం సమస్యపై మంత్రి సవిత స్పందించాలి. ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలని విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలకు వస్తారు. ఇక్కడ అంగళు ఏర్పాటు చేయడంతో చదువుపై దృష్టి సారించలేక ఇబ్బంది పడుతున్నారు.

నరసింహులు
పాఠకుడు రొద్దం మండలం కొగిర గ్రామం

అధికారులకు ఫిర్యాదు చేశాం

గ్రంథాలయానికి అడ్డుగా అంగళ్లు తదితర వాటిని ఏర్పాటు చేసిన విషయాన్ని జిల్లా గ్రంథాలయ అధికారులు, స్థానిక మున్సిఫల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. అధికారులు స్పందించి వెంటనే అడ్డుగా ఉన్న అంగళ్లను తొలగించాలి

మహబూబ్‌బాషా,
గ్రంథాలయశాఖ అధికారి, పెనుకొండ

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల హత్యకు గురైన హిందూపురం రూరల్ మండలం గోళాపురం గ్రామానికి చెందిన సతీష్ కుమార్ కుటుంబానికి తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈ మరకు ఆసంఘం నాయకులు రవికుమార్ ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతు సతీష్‌కుమార్ వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. గ్రామంలో ఎవరికి సమస్య వచ్చిన స్పందించి, వారి తరపున నిలబడి సమస్యను అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసేవాడన్నారు. ఇదే గ్రామానికి చెందిన కొంత మంది యువకులు సతీష్ కుమార్ ను హత్య చేయడం క్షమించరాని నేరం అన్నారు. హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించి మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పి .బాబు, నాయకులు సురేష్, నరసింహమూర్తి, రామకృష్ణ, జగదీష్, మంజునాథ్, చంద్రశేఖర్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రెస్‌క్లబ్ ఎన్నికలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా రామాంజి, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ ఎంపిక అయ్యారు. నూతన ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష పదవికి ఇద్దరు, ప్రధాన కార్యదర్శి పదవికి ముగ్గురు పోటీ పడడంతో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్, పూల శ్రీనివాసులు, జాకబ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా, పూర్వ అధ్యక్షులు సురేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డిలు సహకార అందించారు. హిందూపురం ప్రెస్ క్లబ్‌లో మొత్తం 62 మంది సభ్యులు ఉన్నారు. అయితే వివిధ కారణాలతో 5 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. 57 మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

కల్తీ ఆహారంపై జాగ్రత్తలు అవసరం

కల్తీ ఆహార నియంత్రణ జిల్లా అధికారి రామచంద్ర

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల అనేక రోగాలు కొని తెచ్చుకున్నట్లు ఉంటుందని ఆహార పదార్థాలు పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని జిల్లా ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర హెచ్చరిస్తున్నారు. సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అంతే వేగంగా కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడపడితే అక్కడ విక్రయాలు జరుగుతున్నాయి. వాటిని తినటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. హోటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో ఈ కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు పాటించకుంటే ఆస్మా, క్యాన్సర్ తదితర రోగాలకు గురికావాల్సి వస్తుంది. నేడు ఏ వస్తువు చూసినా కల్తీమయం అవుతోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినాకల్తీ అనేది సర్వసాధారణమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : ఆహార కల్తీ ని ఎలా నిర్ధారిస్తారు? తీసుకునే చర్యలు ఏమిటి?

జవాబు: కల్తీ ఆహారం నియంత్రించడానికి భారత ప్రభుత్వం 2016లో చట్టం తెచ్చింది. దీని ప్రకారం ఏడాదికి రూ.12 లక్షల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి. లైసెన్స్ లేని వారికి ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు ఆరు లక్షల వరకు జరిమానా ఉంటుంది. హోటళ్లలో, కిరాణా షాపులలో కాలం చెల్లిన వస్తువులు అమ్మితే నేరం. కల్తీ ఉన్న ఆహార పదార్థాలను హైదరాబాదులోని ల్యాబ్ కు శాంపిల్ పంపడం జరుగుతుంది. అక్కడ నుంచి 20 రోజులకు కల్తీ ఆహారం పై నివేదికలు వస్తాయి. వాటి ఆధారంగా కోర్టులో చట్టపరంగా శిక్షలు వేస్తారు. రిజిస్ట్రేషన్, లైసెన్సులు అన్ని ఆన్‌లైన్ లో జరుగుతాయి.

ప్ర : ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 312పైగా కేసులు నమోదయ్యాయి. వీటిలో సురక్షితం కానివి, మిస్ బ్రాండ్ కేసులు నమోదు కాగా వాటిని బట్టి కోర్టులు వివిధ రకాలుగా శిక్షలు వేసాయి.

ప్ర : కల్తీ అనేది ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారు ?

జ : కాలం చెల్లిన వస్తువులు విక్రయించడం చట్టరీత్యా నేరం. హోటళ్లలో వాడిన నూనెను తిరిగి రెండు మూడు రోజులుగా వాడుతుంటారు. దానివల్ల క్యాన్సర్, ఆస్మా లాంటి రోగాలు వస్తాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వాడిన నూనెను వాడుతూ ఉంటారు. ప్రస్తుతానికి అవి తినేటప్పుడు రుచికరంగా ఉన్నా వాటి వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయి. కిరాణా షాపులలో గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తుంటారు. వాటిని వినియోగదారులు తీసుకోరాదు.



ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

జ : వస్తువులను కొనే ముందు ఎప్పుడు తయారు చేశారు. వస్తువుకు నిర్దేశించిన గడువు గమనించి కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితులలో గడువు పూర్తి అయిన వస్తువులను కొనరాదు. తాత్కాలికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పదార్థాలు రుచిగా ఉన్నప్పటికీ ఆయిల్ ఫుడ్ ను తినడం వల్ల రోగాలను మనమే కొని తెచ్చుకున్న వారమవుతాము. తాజాగా వేడివేడి పదార్థాలనే భుజించాలి. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.



ప్ర : కల్తీ ఆహారంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా?

జ : పాఠశాలల్లోనూ, అవకాశం వచ్చిన ప్రతిచోట కల్తీ ఫుడ్ పైన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఉన్నాం. కొత్త జిల్లా ఏర్పడినందున తగినంత సిబ్బంది లేరు. వాహన సౌకర్యం కూడా లేదు. దీంతో ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాల్సుంది.

బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం

ప్రజాశక్తి-నల్లచెరువు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు ధ్వజమెత్తారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందని మండిపడ్డారు. స్థానిక దామోదరయ్య మిషన్‌లో ఆదివారం రామకృష్ణ అధ్యక్షతన సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ఆహ్వానితులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బాబ్జాన్, కదిరి పట్టణ కన్వీనర్ జగన్ మోహన్, తనకల్లు మండల కన్వీనర్ వేమన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శివన్న హాజరయ్యారు. నరసింహులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగుల పై వేధింపులు జరుగుతున్నా ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించడం తగదన్నారు. ఇకనైనా అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్స్, పారిశుధ్య కార్మికులు స్కూల్ స్వీపర్స్, వాటర్ మెన్, ఎండిఎం నిర్వాహకులు, తదితర రంగాల్లో పని చేసే కార్మికులపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ వేధింపులు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సిఐటియు వారి పక్షాన నిలబడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. అనంతరం మండల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ కన్వీనర్‌గా రామకృష్ణ, కో కన్వీనర్లుగా నాగిరెడ్డి, బాబయ్య, ఆంజనేయులు, ఎవి.రమణ, సభ్యులుగా అనిత, సుజాత, మోహన్‌రెడ్డి, వేమనారాయణ, పద్మావతి, సుజాత, మణి, రాణి, కె.ఆంజనేయులు, రమాపతిని ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు అన్ని అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో 'హరీష్' అగ్రగామి

ఉన్నత విద్యాప్రమాణాలకు నిలయం.. నేటికి 52 వసంతాలు పూర్తి.. పోటీ పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చడంలో హరీష్ స్కూల్ అగ్రగామిగా నిలిచిందని ఈ పాఠశాల ఉన్నత విద్యాప్రమాణాలకు నిలయమని ఆపాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎంఎస్. కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతంలో ఎంతో మంది విద్యా కుసుమాల ప్రతిభను వెలికితీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేరాలనే ఆశయంతో కర్నాటక రాష్ట్రం మైసూరుకు చెందిన తమ తల్లిదండ్రులు పద్మ శ్రీనివాస్, శ్రీనివాసులు కదిరికి వలస వచ్చి 1972లో పాఠశాలను తొలుత కదిరి పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డు పాత పోస్ట్ ఆఫీసు సమీపంలో స్థాపించారన్నారు. అనంతరం 1992 లో కదిరి రూరల్ మండలం యర్రదొడ్డి సమీపానికి పాఠశాలను మార్చామన్నారు. ఫలితాల్లో ఆటపాటల్లో, క్రమశిక్షణలో, ఎప్పటికి హరీష్ స్కూల్ కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నిలిచిందన్నారు. 2022లో 51 సంవత్సరాలు పూర్తి చేసుకొని విజయవంతంగా ముందుకు సాగుతున్న ఏకైక సంస్థ తమ విద్యాసంస్థ అని కిరణ్‌కుమార్ తెలిపారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఐఎఎస్, ఐపిఎస్, లాయర్లుగా ఉన్నారన్నారు. అంతేకాకుండా దేశ, విదేశాల్లో ప్రయివేటు కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారన్నారు. ఎంతోమంది శాస్త్రవేత్తలుగా కొనసాగుతున్నారన్నారు. తమ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రతిభ లక్ష్యంగా నూతన విద్యావిధానం ఏర్పాటు చేసి ఉత్తమ బోధన అందిస్తున్నామని చెప్పారు.



హరీష్ స్కూల్



కరస్పాండెంట్ కిరణ్‌కుమార్

హరీష్ పాఠశాల ప్రత్యేకతలు

అపార అనుభవం, అంకితభావం, క్వాలిఫైడ్ టీచర్ల చేత విద్యాబోధన చేస్తున్నామని ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు. 3వ తరగతి నుంచి ఒలంపియాడ్, నీట్ పరీక్షకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 6వ తరగతి నుంచి ఐఐటి ఫౌండేషన్ క్లాసుల నిర్వహణ, వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శిక్షణ, రెగ్యులర్ స్టడీ అవర్స్ నిర్వహణ తమ పాఠశాల ప్రత్యేకతలు అన్నారు. అంతేకాకుండా ప్రతివారం క్విజ్, వ్యాసరచన, డిబేట్, స్పెల్ బీ ప్రోగ్రామ్స్ నిర్వహణ చేపడుతున్నట్లు వివరించారు.

ఆహ్లాదకర కార్పొరేట్ వాతావరణం

సువిశాలమైన ప్లే గ్రౌండ్, ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆవరణలో సొంత ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి, వేర్వేరుగా ప్రత్యేక తరగతులు ఉన్నాయన్నారు. మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో స్టడీ అవర్స్ ఉంటుదన్నారు. కరాటే, గేమ్స్, డ్యాన్స్, మెడిటేషన్ నందు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత విద్య శిఖరానికి చేర్చడమే తమ లక్ష్యమని కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ వివరించారు.



నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసి పని చేస్తాం

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసి పని చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ కంపెనీ ఉద్యోగుల నియామకాల ప్రక్రియ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గార్మెంట్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పలమనేరు తిప్పేస్వామి ధన దాహానికి ఇండియన్ గార్మెంట్స్ యాజయాన్యం గత ఐదేళ్లలో రూ. 20 కోట్లు నష్టపోగా, ఇండియా ప్రభుత్వానికి దాదాపు రూ. 500 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. మడకశిర ప్రాంత నిరుద్యోగులు దాదాపు 10 వేల మంది ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారు. అలాంటి నీచ సంస్కృతికి తావు లేకుండా మడకశిర ప్రాంత అభివృద్ధి, నిరుద్యోగ సమస్య తీర్చాలనే సదుద్దేశంతో ఇండియన్ గార్మెంట్స్ యాజయాన్యంతో మాట్లాడి మడకశిర, రొళ్ల, గుడిబండలో గార్మెంట్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఇండియన్ గార్మెంట్స్ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ కంపెనీ మేనేజర్‌తో ఎమ్మెల్యే రాజు, గుండుమల

117 జీవో రద్దు చేయాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వ విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారిన 117 జీవోను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో ఆదివారం యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో తాలూకా యుటిఎఫ్ జోనల్ సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేయాలనే సంకుచిత ధోరణి, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేయాలని నియంతృత్వ పోకడతో 117 జీవోను తెచ్చి ప్రభుత్వ బడుల పతనానికి నాంది పలికిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే రికార్డు స్థాయిలో డీఎస్సీ ప్రకటించిన నూతన సిఎం చంద్రబాబు తక్షణమే 117జీవోను రద్దు చేసి ప్రభుత్వ బడులకు ప్రాణం పోయాలని కోరారు. యుటిఎఫ్ కామ్రేడ్స్ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గుడిబండ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహప్ప, మూడ్ల గిరియప్ప, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న

పేదలకు కంటి చూపు ప్రసాదించడం ఓ వరం

ధర్మవరం టౌన్ : పేదలకు కంటిచూపు ప్రసాదించడం ఓ వరం లాంటిదని చేనేత ప్రముఖులు సందా రాఘవ, జింకా పురుషోత్తం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప నగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు 95 మందికి కంటి పరీక్షలు చేసి 58 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర తెలిపారు. సందా రాఘవ, జింకా పురుషోత్తం మాట్లాడుతూ జీవితంలో ఎంత సంపాదించామన్నది కాదు అందులో పేదలకు ఎంత ఖర్చు చేశారన్నదే ముఖ్యమన్నారు. ధర్మవరంలో దాతలకు కొదవలేదని పేదల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సుంకు సుకుమార్, జయరాం, నాగార్జున, బండి నాగేంద్ర, డాక్టర్ సుబ్బారావు, రాధాక్రిష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, వైకె.శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథ్, చాంద్ బాషా, రామచంద్రగుప్తా, రంగం ఆది, వాసుదేవుడు, శివప్రసాద్ పాల్గొన్నారు.



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే 'గోనుగుంట్ల' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. అనంతరం దుర్గమ్మ ఆలయంలో గోనుగుంట్ల సూర్యనారాయణ పేరిట అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో గోనుగుంట్ల అభిమానులు బొడగల గిరిధర్, చిలకం సూర్యనారాయణరెడ్డి. పొరాళ్ల రహీం, రంగానాయుడు, మహేష్‌బాబు, చిదంబరనాయుడు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, బోయనపల్లి సుజాత, సాహెబీ, ఓలేటి మురళి, గంధమనేని నారాయణస్వామి పాల్గొన్నారు.



ధర్మవరం గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయం వద్ద కేక్కట్ చేస్తున్న గోనుగుంట్ల అభిమానులు

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

గోరంట్ల : పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలోని రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వంద మంది నేత కార్మికుల విద్యార్థులకు దాతలు కట్టా నారాయణ, కట్టా రామచంద్ర, వట్టి నారాయణ స్వామి ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పలకలను మాజీ ఎంపీటీసీ యువశేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్, సురేష్, కృష్ణమూర్తి, వృషభదేవుడు, భరత్, రాజు, దేవాంగ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్‌షాపు ప్రారంభం

మడకశిర : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి ఆదేశాల మేరకు మండలంలోని చందకచర్ల పంచాయతీ ఎగువ అచ్చంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ దుకాణాన్ని(షాపు నెంబర్-18) ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాధమ్మ ఆంజనేయులు, వెంకటేశులు, నరసింహారెడ్డి, క్రిష్టప్ప, వెంకటాద్రి, పాండు, మారుతి, లక్ష్మీనారాయణ, కె.రంగస్వామి, రమేష్, శ్రీరామప్ప, గిరి, హనుమంతు, గోపి, చౌడప్ప, రామచంద్రప్ప, శీనప్ప, ఆటో శివప్ప, రమేష్, సుబ్బరాయప్ప, అశ్వత్థప్ప పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

రొద్దం : రెండు రోజుల క్రితం తీర్థయాత్ర వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని చిన్నగువ్వలపల్లి గ్రామానికి చెందిన రామాంజినమ్మ కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. అలాగే పలువురు వైసిపి మండల నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి నాయకులపై దాడి సరికాదు

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నాయకులపై టిడిపి శ్రేణులు చేస్తున్న దాడులు సరికాదని మాజీమంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండలంలోని కంచి సముద్రం గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఆదివారం ఆమె ఆ గ్రామం వెళ్లి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ టిడిపి శ్రేణులు వైసిపి నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఆమె వెంట లోచర్ల సర్పంచి గంగాధర్, మండల నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, చిన్నా, ఎన్. నారాయణరెడ్డి ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : ఎంఇఒ

ధర్మవరం టౌన్ : అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఇఒ గోపాల్‌నాయక్ తెలిపారు. మండలంలోని రావులచెరువు ప్రాథమిక పాఠశాల(ఎల్ఎఫ్ఎల్) హెచ్ఎం గోపాల్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎంఇఒ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గోపాల్ ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూ సుమారు 30 ఏళ్ల పాటు సమర్థవంతంగా విధులు కొనసాగించారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని, ఆ సమయం కొంత బాధ కలిగించినా, తన వృత్తికి పూర్తి న్యాయం చేశానన్న ఆత్మసంతృప్తి ప్రతి హృదయంలో ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుడు తన బోధనతో పాటు, తన సబ్జెక్టు పట్ల నిరంతర విద్యార్థిగా ఉన్నప్పుడే చదువుకు సార్థకత లభిస్తుందని, అప్పుడే విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతారని తెలిపారు. అనంతరం గోపాల్‌ను ఎంఇఒతో పాటు తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా వెంకటేష్

ముదిగుబ్బ : ముదిగుబ్బ మండల సిఐటియు కన్వీనర్‌గా వెంకటేష్ ఎన్నిక య్యారు. స్థానిక సొసైటీ ఆవరణ లోని రైతు బజార్‌లో ఆదివారం నిర్వహించిన సిఐటియు సమన్వయ కమిటీ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, సిఐటియు జిల్లా శ్రామిక మహిళా అధ్యక్షురాలు దిల్షాద్, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో సిఐటియు మండల కన్వీనర్‌గా వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోకన్వీనర్‌గా సూర్యనారాయణ, రజియా, ఓబులేసు, శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీదేవి, ఎర్రమ్మ, జయలక్ష్మిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, సిఐటియు అనుబంధ సంస్థల్లోని కార్మికులు, కర్షకుల కోసం శ్రమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంపి బాబు, మునాఫ్ పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల సంఘం కోశాధికారిగా చంద్రశేఖర్‌గుప్తా

పుట్టపర్తి క్రైమ్ : జిల్లా వినియోగదారుల సంఘం కోశాధికారిగా పుట్టపర్తికి చెందిన సుంకు చంద్రశేఖర్‌గుప్తా ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘం సభ్యులు చంద్రశేఖర్ గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. వినియోగదారులకు ఎక్కడా అన్యాయం, మోసం జరగకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు.

సంగారెడ్డి జిల్లా వాసుల పర్తియాత్ర

పుట్టపర్తి క్రైమ్ : తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లాకు చెందిన సుమారు 2వేల మంది సత్యసాయి భక్తులు పర్తియాత్రగా పుట్టపర్తికి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం హనుమాన్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సాయి కుల్వంత్ హాలులో సంగీత కచేరీతో పాటు నాటికలు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ ఏటా ప్రశాంతి నిలయానికి పర్తియాత్రగా వస్తున్నామన్నారు. జిల్లాలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇక్కడికి వచ్చామన్నారు.

అండర్-19 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ధర్మవరం టౌన్ : అండర్-19 చెస్ పోటీలకు పట్టణంలోని బిఎస్‌కె చెస్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారని చీఫ్ కోచ్ ఆది రత్నకుమార్ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 12, 13, 14 తేదీల్లో నంద్యాలలో ఎపి చెస్ అసోసియేషన్ నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. ఈ నెల 7వ తేదీ హిందూపురంలో స్పార్టన్ చెస్ అకాడమీలో నిర్వహించిన జిల్లా ఓపెన్ పోటీల్లో అండర్-19 బాలుర విభాగంలో ఎస్.కేదార్‌నాథ్, పి.హర్షచైతన్య, అండర్-19 బాలికల విభాగంలో పి.సహస్ర ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.



అండర్-19 చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నేరాలు ఘోరాలు

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

పరిగి : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మండలంలోని గొరవనహళ్లిలో గ్రామస్తులకు రూ. లక్షల నష్టం వాటిల్లింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉన్నఫళంగా హై వోల్టేజీతో సరఫరా కావడంతో గ్రామంలోని సుమారు 60 ఇళ్లలో ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు అధికారులను నిలదీశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని సుమారు 60కి పైగా ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, తదితర ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం అవ్వడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసి ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో సుమారు 50 టీవీలు, 20కి పైగా ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట జూదరులు అరెస్ట్

లేపాక్షి : మండలంలోని కంచి సముద్రం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 2,240 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మండలం వ్యాప్తంగా ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

బీకాం కోర్సును కొనసాగించాలి

కదిరిటౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బికాం జనరల్ కోర్సును కొనసాగించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొనడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారిస్తాం : 'కోటి'

బత్తలపల్లి : వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇకపై మండల వ్యాప్తంగా ప్రజా సమస్యలపై ప్రత్యే దృష్టి సారిస్తామని వైసిపి మండల ఉపాధ్యక్షులు కోటి సురేష్ తెలిపారు. బత్తలపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ విజయవాడలో జగన్‌ను కలవగా నిరంతరం ప్రజలకు అండగా నిలవాలని సూచించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కలిసి బాగా పని చేయాలని సూచించారన్నారు. భవిష్యత్ మనదేనని ధైర్యం చెప్పి పంపారని తెలిపారు.



జగన్‌తో కోటి సురేష్

నేడు ఎమ్మెల్యే 'కందికుంట' పర్యటన

కదిరి టౌన్ : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఉదయం 7:30 గంటలకు రూరల్ మండలంలోని పట్నం గ్రామం నుంచి తలుపుల మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి కాలువలను పరిశీలిస్తారు. ఆ తరువాత హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

13న యుటిఎఫ్ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ టోర్నీ

ధర్మవరం టౌన్ : యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు పురస్కరించుకుని జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో క్రికెట్ టోర్నీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యుటి ఎఫ్ టోర్నీ కన్వీనర్‌గా జిల్లా కార్యదర్శి జిసి.నరేశ్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, రాంప్రసాద్, సకల చంద్రశేఖర్, సురేశ్, రామాంజనేయులు, సాయిగణేశ్, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొత్తచెరువు : స్థానిక నాగిరెడ్డిపల్లి రహదారిలోని గుడిసెల్లో నివాసం ఉంటున్న వారికి, ప్రభుత్వాసుపత్రి వెనుక కొండలో ఉన్న పేద విద్యార్థులకు ఆదివారం పుట్టపర్తికి చెందిన కిత్మద్ ఏ కల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు షామీర్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సత్యసాయి భక్తులు సుమతి, లాస్య, నవనీత్‌కుమార్ 80 మంది పేద విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. వారు మాట్లాడుతూ సత్యసాయి బాబా ఆశీస్సులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పేద విద్యార్థులు, ప్రజలకు తమ వంతు సహాయ, సహకారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజు, జావిద్, సోహెల్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

బత్తలపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని తహశీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అలాగే మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలు అందజేయవచ్చు అన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకుని ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంక్ ఎదుట జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించారు. అలాగే కేతిరెడ్డి కాలనీ, ధర్మపురిలో ఎమ్మార్పీ ఎస్ జెండాలను ఆవిష్కరించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేసు, జింకా చంద్ర పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరిడి బూదెప్ప, రామాంజనేయులు, శివప్రసాద్, గంగాధర్, నారాయణ, జివిఎన్.ప్రసాద్, సుధాకర్, చంద్రాయుడు, సాకే నాగరాజు, సాకే రామ్మూర్తి, గోవిందప్ప పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ముఖ్యఅతిథి సర్పంచి ముద్దలపల్లి గోవింద్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భావన, రమణ, దొడ్డెప్ప లక్ష్మన్న, రామకృష్ణ, శ్రీనివాసులు, ఎల్లంరాజు, లక్ష్మీపతి, రామాంజనేయులు, కత్తి ఆనంద్, పలక గంగన్న, చౌడప్ప, కిష్టప్ప, దారా వెంకటరమణ పాల్గొన్నారు.

నల్లచెరువు : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎవి.రమణ, వెంకటస్వామి, అంజనప్ప, శ్రీనివాసులు, అంజి, తిరుపాల్, సుధీర్, వేమ నారాయణ పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని దొడగట్ట గ్రామంలో దండోరా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బైలాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి రాజు, ఓబులేసు, రాజు, దొడగట్ట గ్రామ కమిటీ అధ్యక్షులు, గోపాల్, శంకర్, మూర్తి, నాగరాజు, దుర్గప్ప, జయప్ప, ఈశ్వర్, బాలు, నరేష్, గోపాల్ పాల్గొన్నారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివ, హరీష్, ఈశ్వర్, ఓబులేసు, పెద్దన్న, రామాంజనేయులు, నరసింహులు, పోతలయ్య పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముదిగుబ్బ : స్థానిక అంబేద్కర్ సర్కిల్ సమీపంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోటప్ప, ఓబులేసు, కుళ్లాయప్ప, ఓబుళపతి, బాబు, సత్యనారాయణ, శ్రీరాములు, అంజప్ప, రమణ, వరదప్ప, పర్వతయ్య, పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : దామాజిపల్లి ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకుల సమక్షంలో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఎంఆర్‌పిఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే కేక్ కట్ చేశారు.